# వీడ్కోలు



వల్లూరు శివప్రసాద్

గ్రామ కచేరి చావిడి దగ్గర అప్పుడే వాన కురిసి వెలిసినట్లుగా వుంది. కొద్ది నిమిషాల క్రితం వరకు అక్కడ మూగివున్న గుంపులో చివరకు పదిమంది మాత్రం మిగిలారు. అందరి ముఖాల్లో విజయగర్వం తొంగిచూస్తుంది. కాని ఒక్క సౌభాగ్యరావు ముఖంలో ఉత్సాహం అంతంతమాత్రంగానే కనిపిస్తుంది.

"సౌభాగ్యరావన్నా! వెధవల పొగరు అణిగిపోయింది. మనతో తలపడట మంటే ఆటలనుకున్నారు గామోసు." అన్నాడు నూనూగు మీసాల కుర్రవాడు.

ఆ మాటలతన్ని సంతోషపెట్టలేదు. అందరిలా పూర్తి విజయం అనుకోవటం లేదతడు. ఆ విజయంలో కొంత ఓటమి కూడా ఇమిడివుంది. కేవలం వందల్లో కొట్టిపేయాల్సిన పాట నాలుగువేల దాకా పోయింది. అంత రేటు ఎక్కటం ప్రత్యర్థుల విజయంగా భావిస్తున్నాడు.

అదే మాట తన సహచరులతో అన్నాడు. "వెధవచెట్టు నాలుగువేలు పడుతుందా!" అని. అంతిమ విజయం

**1982 చక్రపాణి రెండవ ఎవార్డు పొందిన కథ**

తమదన్న సంతోషంలో వాళ్ళదేమీ పట్టించుకోలేదు.

"చూడబ్బాయి! డబ్బుదేవుంది. తలా కాస్త వేసుకుందాం. పనికొచ్చినంత వరకు చెక్కలు కోయిద్దాం, మిగతాది కట్టెపేళ్ళకు పనికివస్తుంది. ఇందులో నష్టపోయే దేముంది." అన్నాడు మునసబు.

ఆ సలహా సౌభాగ్యరావుకు నచ్చింది. సరే నన్నాడు. పంపకాలు జరిగాయి.

సౌభాగ్యరావు ముప్ఫయ్యేళ్ళు నిండని యువకుడైనా, అవలిస్తే ఓట్లు లెక్కెట్ట గల రాజకీయ చాతుర్యం సంపాదించి, తలలు కొట్టో, కాళ్ళు పట్టో ఆ వూరి ప్రెసిడెంటయ్యాడు.

ఎన్నికల వుక్రోషాలతో అయినవాళ్ళు కానివాళ్ళగా, కానివాళ్ళు అయినవాళ్ళగా రెండు వర్గాలయ్యారు. ఇరువర్గాల మధ్య పచ్చగడ్డి వేయకుండానే మంటలు లేస్తాయి. ఒకర్నొకరు దెబ్బతీయటానికి ఏదో సాకు వెతుక్కుంటుంటారు.

ఊరందరిదీ 'ఒక్కమాట' అనే రోజులు పోయాయి. రెండు మాటలుగా ఎప్పుడో చీలిపోయారు. ఊరి బాగోగుల కన్నా, అధిపత్యంకోసం ప్రాకులాటనే వాళ్ళను విడదీసింది. అందుకే ప్రతి విషయంలోనూ పొటేళ్ళలా తలపడు తుంటారు. శృతిమించి పోటీలుపడి తలలు పగలకొట్టుకున్న సందర్భాలూ వున్నాయి.

ఒక గంట క్రితంనుండి కచేరి దగ్గర జరిగిన తతంగం అదే. ఊరికి వుత్తరపు కొసన వున్న మర్రిచెట్టు పాట పెట్టారు. నాలుగైదు తరాల్ని ఎరిగిన చెట్టది. ఒక్కో తరపు ఆకతాయి పిల్లల అల్లరిని భరించింది. ఊడల కదలికలతో చేతులు చాసి రారమ్మని పిలుస్తున్నట్లుగా అతిధులకు స్వాగతం చెప్తుంది. తన చల్లని నీడలో అప్యాయంగా అందర్నీ సేద తీరుస్తుంది.

పక్షుల కిలకిలారావాలతో ఆ వూరికే సందడిగా వుంటుంది. అలా ఎన్నో విధాలుగా ఆ వూరిలో బాంధవ్యాన్ని ఏర్ప రచుకున్నది. దానికే నోరుంటే రెండు శతాబ్దాల ఆ వూరి గతచరిత్రను చెప్ప గలదు. ఆ వూరితో అంతటి సాన్నిహిత్యాన్ని ఏర్పరచుకున్న ఆ మర్రిచెట్టును నిర్జీవంచేసి పంచుకోబోతున్నారు.

"వెంకటేశూ! ఉదయం పదిమంది కూలీలను తీసుకెళ్ళి చెట్టు నరికించేయి. నాలుగు రోజులకల్లా, అక్కడ పూచిక పుల్ల కూడా కనపడకూడదు." చెప్పాడు సౌభాగ్యరావు.

తలూపాడు వెంకటేశు. అంతా లేచి వెళ్ళబోతూ, కచేరి చావిడిలోకి వస్తున్న ముసలాయన్ని చూసి ఆగిపోయారు.

"ఏం శివయ్యతాతా! అంతా బయల్దేర బోతుంటే ఇప్పుడు వచ్చావేం?" పలక రించాడు మునసబు.

శివయ్య పోటుకర్రను అరుగుకి చార

వేసి ఒక ప్రక్క కూచున్నాడు. సౌభాగ్య రావు ఆయన్ని చూసి ముఖం తిప్పు కున్నాడు. ప్రతిదానికీ చాంధసంగా అడ్డు పడుతుంటాడని ఆయనంటే చిరాకు.

శివయ్యను కొత్తగా చూసినవాళ్ళు ఆయనకు దాదాపు వందేళ్ళ వయసంటే నమ్మలేరు. ఇంచుమించు ఆరడుగుల ఎత్తు. కాస్త వంగబడిన దేహం. పసిమి రంగు. ముడతలు పడ్డ ముఖంలో వర్చస్సు కనిపిస్తుంటుంది. తల మధ్య నుండీ, తెల్లని వెంట్రుకలు పొడవుగా వెనక్కు జులపాలు తిరిగాయి.

ఆయన ముఖంలో విషాదచ్ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. "నాయనా! మీ పంతాలకు నోరులేని ఆ చెట్టే దొరి కిందా?" అడిగాడు సూటిగా.

శివయ్య ఎందుకు వచ్చిందీ, అక్కడి వాళ్ళకు బోధపడింది. సమాధానం సౌభాగ్యరావే చెప్పగలడన్నట్లుగా అంతా అతనికేసి చూసారు.

"తాతా! ఇందులో కాని పనేముంది. ఆ చెట్టుతో లేనిపోని గొడవలొస్తున్నాయి. అందుకే కొట్టేయిస్తున్నాం." చెప్పాడు సౌభాగ్యరావు.

"పిల్ల వెధవలంతా చెట్టెక్కి కాళ్ళు, చేతు లిరగ్గొట్టుకుంటున్నారు. వాళ్ళకు కాపలా కాయలేక చస్తున్నాం." మునస బందుకున్నాడు.

"రోడ్డు వెడల్పు చేయటానికి ఆ చెట్టువల్లనే ఇబ్బందవుతుంది. ట్రాఫిక్ పెరిగిపోయిందాయె! ఆ చెట్టు నరికించ మని గవర్నమెంటువాళ్ళూ గొడవ చేస్తున్నారు." వంతపాడాడు మరొకతను.

"ఆ చెట్టుమీద దయ్యాలు కూడా తిష్ట వేస్తున్నాయి. మొన్న సుబ్బడి పెళ్ళానికి అక్కడేగా దయ్యం పట్టింది." వెంక టేశు అన్నాడు.

ఎవరికి తోచిన కారణాలు వాళ్ళు చెప్తున్నా, అసలా చెట్టును నరికించటం వెనుకనున్న ఉద్దేశం, సౌభాగ్యరావుతో పాటు మరో ఇద్దరికే తెలుసు.

ఆ వూరు ఏడెనిమిది గ్రామాలకు కూడలి. ఈ మధ్యనే ఆ వూరిమీదుగా పై వూళ్ళకు రెండు దిశలుగా బస్సులు వేశారు. వచ్చేపోయే బస్సులతో సెంటర్ అవుతుంది. ఒక **హోటల్** పెడితే వ్యాపారం బాగా సాగుతుందన్న ఆలో చన రావడంతో ఈ నిర్ణయానికొచ్చారు. ఆ చెట్టు నరికిన స్థానంలోనే షెడ్డువేసి, **హోటల్** పెట్టించాలని సౌభాగ్యరావు అనుకుంటున్నాడు.

"నాయనా! అడ్డనుకుంటే ఎన్ని కార ణాలయినా చెప్పొచ్చు. మా తాత ముత్తాతల కాలంనాటిది. దేవతలా పూజ లందుకుంది. తల్లిగా చేరదీసి నీడనిచ్చింది. ఆ చెట్టుక్రిందనే పెరిగాం. ఆ చెట్టు క్రిందనే ఒకటిగా కూడి ఆత్మీయత పంచుకున్నాం. నా కళ్ళముందే నిర్దాక్షి ణ్యంగా గొడ్డళ్ళతోముక్కలుముక్కలు

చేయటం భరించలేను." ఆయన కంఠంలో బాధ ధ్వనించింది.

"తాతా! ఏ తరం ఆలోచనలు ఆ తరానివి. అప్పట్లో మీరా రకంగా వుపయోగం పొందారు. ఇప్పుడు మేం మరోలా వుపయోగం పొందుతాం. నువ్వు కాదనుకుంటే మాత్రం ఇది ఎల్లకాలం బ్రతుకుంటుందా? చచ్చిన చెట్టు నిరుపయోగం కాదుగా!" అన్నాడు సౌభాగ్యరావు.

భారంగా నిట్టూర్చాడు శివయ్య. "అవునయ్యా! నీడలో చల్లదనం మేం పొందాం. కాలే కట్టెల మంటలో వేడి మీకు కావాలి. తరతరాలకు ఆ నీడ నివ్వాలని మేం నాటేం. మీ తర్వాతి తరానికిమీరేం మిగుల్చుతారు?" అడిగాడు ఆయన.

ఆ తర్కం అక్కడున్నవా రెవరికీ తలకెక్కలేదు. విసుగనిపించింది. ముసలాడిది అర్థంలేని వాగుడనిపించింది.

"తాతా! అనవసరపు వాదనెందుకు? పంచాయితి చెట్టు పాటపెట్టింది. కావాల్సినవాళ్ళు పాడుకున్నారు. ఆ డబ్బు వూరికి మరోరకంగా వుపయోగిస్తుంది. నువ్వొద్దు చెప్పినా జరగాల్సింది ఆగదు. ఉదయమే చెట్టు కొట్టెయ్యబోతున్నారు. అంతే!" లేచి నిలబడ్డాడు సౌభాగ్యరావు.

కొద్ది క్షణాల్లో అంతా అక్కడ్నుండి బయటకు వెళ్ళిపోయారు. ఓడిపోయిన వాడిలా శివయ్య ఒక్కడే అక్కడ మిగిలాడు.

ఈ ఓటమి ఆయనకు మొదటిది కాదు. కొన్నేళ్ళుగా ఆయనకు నచ్చకున్నా వూరిలో ఎన్నో మార్పులు జరిగిపోతూనే వున్నాయి. చావిళ్ళు పేకాట క్లబ్‌లయ్యాయి. బ్రాందీషాపు వెలిసింది. ఊరు కొట్లాటలకు నిలయమైంది. పోలీస్‌స్టేషన్ వచ్చింది. హృదయం గాయపడుతూనే వుంది.

"కాలం మారింది! కాలం మారింది!" ఎప్పటిలానే గొణిగాడు. ఊరంతటికీ కాపలాదారులా, దూరంగా కనిపిస్తున్న మర్రిచెట్టు చిటారుకొమ్మలు, కన్నీటి తెరలవెనుక మసక మసగ్గా కదలాడుతున్నాయి.

లేచి, పోటుకర్రందుకుని వీధిలోకి వచ్చాడు.

పడమటి ఆకాశంలో సూర్యుడు అస్తమిస్తున్నాడు. మేతకు వెళ్ళిన పశువుల మందలు దుమ్ము లేపుకుంటూ తిరిగొస్తున్నాయి. పక్షులు అరుస్తూ, గుంపులుగా మర్రిచెట్టుమీద వాలుతూ, లేస్తూ వూరంతా సందడిచేస్తున్నాయి.

'రేపటినుండి అంత సందడి ఎక్కడుంటుంది? నివాసం కోసం చెట్టుల్ని వెదుక్కుంటూ వూరొదిలి వెళ్ళిపోతాయి!' అనుకున్నాడు శివయ్య.

కార్తీకమాసం. శివాలయంమీద మైకులోనుండి పాటలు వినిపిస్తున్నాయి. భక్తిగీతాలకు బదులు, పచ్చి శృంగారపు



యువ




పాటలు వినవస్తున్నాయి. అది సహించ లేక ఓసారి గుడిపూజారిని నిలదీసి అడిగాడు.

"అయ్యా! నన్నేం చెయ్యమంటారు! కుర్రకారంతా గుడిలో చేరి అసభ్యపు పాటలు వేయిస్తున్నారు. అదేమిటంటే నా మీదకే తిరగబడ్డారు. వాళ్ళకు అదుపూ లేదు, అడ్డూ లేదు. ఇష్టం లేకున్నా దేవుడి పాదాల దగ్గర చోటు లేకుండా చేస్తారన్న భయంతో భరించాల్సి వస్తుంది." చెప్పాడు.

ఆ అసభ్యత అంతటితో ఆగలేదు. దేవుడి వూరేగింపులనాడు రెండు పార్టీల వాళ్ళు పోటీపడి రికార్డు డాన్సులు పెడ్తున్నారు. బూతుపాటలకు అనుగుణంగా ఆడవాళ్ళ చిందులు, అంగాంగ ప్రదర్శనలు. కుర్రకారు ఈలలు.

ఆ విచ్చలవిడితనాన్ని భరించలేక గుడి ట్రస్టీలతో వివాదపడ్డాడు. "ఏవయ్యా! ఇంత అనాచారం జరుగుతుంటే పెద్దలు చూస్తూ ఎలా వూరుకుంటున్నారు? పవిత్రత, పరిశుద్ధత లేనపుడు పూజా పునస్కారాలకు అర్థం ఏమిటి?" ఆవేదనగా ప్రశ్నించాడు.

"తప్పేముందయ్యా! ఆ రోజుల్లో దేవాలయాల్లో మాత్రం దేవదాసీల నృత్యాలుండేవి కావా?" ఎదురు ప్రశ్న వేసారు.

"ఉన్నా అవి సంప్రదాయబద్ధమైన నృత్యాలు. అందులో వెకిలి చేష్టలు, వెర్రి వేషాలూ వుండేవా?"

"మీ కాలంలో అది సంప్రదాయ మనుకుంటే, ఈ కాలంలో ఇదీ అంతే! కుర్రకారు సరదాలు మనమెందుకు

కాదనాలి. నచ్చకుంటే మనం చూడకుంటే సరి." అంటూ వంతపాడారంతా.

నిస్సహాయంగా, "కాలం మారింది! మనుషులూ మారుతున్నారు!" అనుకోవటం మినహా ఏం చేయగలిగాడు.

సత్సాంప్రదాయాలను కాపాడుకోవటంకోసం పదిమందీ ఏకమయ్యేవారు తమ కాలంలో. ఈనాడు వాటిని ధ్వంసం చేసేందుకు అందరూ పూనుకుంటున్నారు.

ఆలోచిస్తూ నడుస్తున్నవాడల్లా ఎవరో పిలిచినట్లు నిలబడిపోయాడు శివయ్య. ఎదురుగా తాగిన మైకంలో వాగుతూ సూరయ్య. పిల్లలు చుట్టూ మూగి ఆటలు పట్టిస్తున్నారు.

"నమస్తే పెత్తాత! తాగి కంటబడ్డం దుకుషమిందాలి." కాళ్ళందుకోబోయాడు. శివయ్య వెనక్కు అడుగేశాడు.

"సూరయ్యా! ఎందుకురా ఇలా నాశనమవుతావు? పెళ్ళాం బిడ్డల ముఖం చూసన్నా బాగుపడలేవట్రా!" అన్నాడు జాలిగా.

సూరయ్య మైకంలో దీర్ఘంగానవ్వేడు.

"తాత! ఆ కాలపు మంచి షెప్పటానికి, గుర్తుచేటానికి నువ్వొడిపే పర్మాత్తుడిలా మిగిలావు. చేడేటోన్నల్లా చూసి బాధపడ్తావ్! బాగుపడండిరా అంటావ్. ఎవ. డినడు. చుట్టూ షెడ్ వున్నప్పుడు ఎలా బాగుపడ్తా....ర్.... ర్! అంతా షెరిసే వోళ్ళేగా! ఎవడెంత షెడితే పక్కోడంత బాగుపడ్తార్. నేను షెడ్డా, వాళ్ళు బాగుపడ్డార్." చెప్తూ తూలిపడబోయి నిలదొక్కుకున్నాడు.

శివయ్య నిట్టూరుస్తూ "సూరయ్యా! ఎందుకు అల్లరిపడతావు. ఇంటికెళ్ళి పడుకో నాయనా!" అన్నాడు బాధగా.

"ఆఁ! ఏవుందింటికాడ? అంతా దరిద్రవేగా! చీట్లాడి వేలు సంపాదిద్దామనుకున్నా. ఏనాడూ ముక్క కలవలేదు. మడిషెక్కలూ మిగల్లేదు. కొన్నాల్లకు మనవూ మిగలం...." చెప్పుకుపోతున్నాడు.

ఆ ధోరణికి అడ్డులేదని శివయ్యకు తెలుసు. అందుకనే, "వస్తానురా!" అంటూ తప్పుకుని ముందుకు సాగాడు.

"నీలాటి మంచోళ్ళు మరో వందేళ్ళు బతకాల. మంచినీ బతికించాల. లేకుంటే ఈ లోకం ఖాళీ బుడ్డయిపోద్ది...."

సూరయ్య మాటలు క్రమంగా దూరమయ్యాయి.

తన కళ్ళముందే పుట్టాడు. పెరిగాడు. తండ్రి పోతూ బంగారంలాంటి మాగాణి భూమి ఇరవై ఎకరాలు అప్పగించాడు. కాయకష్టం చేస్తూ తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న అతన్నెవరో దారితప్పించారు.

పట్నపు సరదాలు అతన్ని ఆకర్షించాయి. పేకాట క్లబ్‌లకు అలవాటు పడ్డాడు. వందలొందలు పెడ్తూ, దాదాపు ఆస్తంతా అమ్మేశాడు. తాగుబోతయ్యాడు. బికారిలా మిగిలాడు.

సూరయ్యను మార్చాలని ఎన్నో

విధాలుగా చెప్పిచూశాడు. ఫలితం లేక పోయింది. ఎంతకాలమని చెప్తాడు? ఎందరినని మార్చగలడు?

'చెడుదారికి మళ్ళించినంత తేలిక కాదుగా, మనిషిని మంచిగ మార్చటం. రేయింబవళ్ళు కష్టపడి నెత్తురోడి సంపాదించినదంతా పట్టణాల్లో దుర్వ్యసనాలకు ధారపోస్తున్న సూరయ్యలు ఎందరు లేరు?'

'పల్లెటూళ్ళ సౌభాగ్యాన్ని ఎన్ని రకాలుగా పట్టణాలు దోచుకోవటంలేదు?' ఆవేదనగా అనుకున్నాడు.

ఇంటికి చేరేప్పటికి కాంతి మసక మసగ్గా వుంది. పాడుబడ్డ దివాణంలా నిశబ్దంగా వుంది ఇల్లు. వసారా పడక కుర్చీలో నిస్సత్తువగా వాలాడు. ఎన్నో ఏళ్ళగా అలవాటుపడ్డ ఒంటరితనవే అయినా ఈ రోజెందుకో మరీ దుర్భరంగా అనిపిస్తుంది.

'సుదీర్ఘమైన జీవితం మనిషికి ఎంత శాపం?' ఇన్నేళ్ళగా లెక్కలేనన్ని సార్లు అనుకుంటూనే వున్నాడు.

కొడుకులూ, కోడళ్ళు, మనుమలు కళ్ళముందు కదలా తూ ఇల్లు కళకళలాడుతుంటే తన జీవితం వెళ్ళమారి పోవాలనుకున్నాడు. ఎవరిదారి వారిదయింది.

"శివయ్యతాతా! గూట్లో మజ్జిగ, అరటిపళ్ళు పెట్టాను తీసుకో. నే వెళ్తున్నా." పొరుగింటి సుబ్బులు వెలిగించిన దీపం గడపలో వుంచి వెళ్ళిపోయింది.

చీకటి పడింది. వీధిలో మనుషులు తిరుగాడుతున్నట్లు మాటలు చెవిన పడుతున్నాయి. తెల్లవారేవరకు నిద్ర పట్టీపట్టని స్థితిలో నరకం అనుభవించటం మామూలే! దుర్భరమైన నిశబ్దంలో శబ్దంకోసం అయన మనసు తహతహలాడుతుంది. ప్రతి చిన్న శబ్దమూ తనను పరామర్శిస్తున్నట్లే భ్రమపడ్తాడు.

చీమ చిటుక్కుమన్నా వీధి వాకిలి కేసి గ్రుచ్చిగ్రుచ్చి ఆశగా చూస్తూ, అంతలోనే నిరాశపడ్తూ భారంగా నిట్టూర్చుతున్నాడు. అలా ఆయన ఎదురు చూస్తుంది పిల్లలకోసం.

ఒకోరోజు ఇరుగుపొరుగింటి పిల్లలు మంచి కథలు చెప్పమంటూ రాత్రిళ్ళ చుట్టూ చేరతారు. ఒంటరితనాన్ని మర్చిపోతాడు. సుదీర్ఘమైన తన జీవితంలో విన్నవి, కన్నవి ఎన్నో సంఘటనలు కథలుగా చెప్తాడు. ప్రతిదాని వెనుక ఒక నీతి వుంటుంది.

ఆ కాలపు విలువలు చిన్నారి మనసుల్లో బీజాల్లా మొలకలెత్తాలన్న తాపత్రయం కనిపిస్తుంది. ఈ కాలపు కల్మషాలు వారిని మలినపరచకూడదన్న ఆందోళన ద్యోతకమవుతుంది.

కథలు వింటూంటే ఒకరిద్దరుఅక్కడే పడి నిద్రలోకి జారిపోతే, వాళ్ళ వూపిరి శబ్దాలతో తాదాత్మ్యం చెందుతూ,

"బాబూ! ఈ అంధకారానికి మీరైనా దీపాలు కండి. పల్లె లోగిళ్ళకు వెలుగు తోరణాలు కట్టండి. ఒకే కుటుంబంలా అంతా కష్టసుఖాలు పంచుకోండి." అనుకుంటూ పదేపదే కళ్ళొత్తుకుంటాడు.

"పిల్లలు వస్తే బాగుండును! కాని ఎవరూ వచ్చేట్టు లేరు." అనుకుంటూ పూర్తిగా నిరాశపడ్డాడు. వేదనాభారాన్ని తొలగించుకోవటానికి పిల్లల సాంగత్యం ఆయనకో వుపశమనం.

అటకమీద చుంచులు 'కీచుకీచు' మంటూ తిరుగాడుతుంటే దృష్టి మళ్ళింది. బూజుపట్టి, అటకమీద పడున్న వ్యవసాయ పనిముట్లు చూస్తుంటే హృదయం పిండినట్లయింది.

అవి కొయ్యముక్కలు కావు. తన కండరాల స్పర్శతో చైతన్యం పొంది, ధాన్యపు రాశులను వడ్డించిన బంగారు చేతులు. అవి మూలబడిపోయాయి.

గత వైభవం ఒక్కసారిగా శివయ్య కళ్ళముందు కదులాడింది. ముంగిట తోరణాల్లా వేలాడే ధాన్యపు గుత్తులు, ఇంటినిండుగా కంటికింపు కలిగించే ధాన్యపు గాదెలు, పెరటి చావిట్లో మోర లెత్తి పచ్చగడ్డికోసం అరిచే పాడి పశువులు, వచ్చీరాని నడకలతో పసిపిల్లల్లా కేరింతలు కొడుతూ పరుగులెత్తే లేగ దూడలు, కాడి మెడలకెత్తమని తలాడించే గిత్తల జంటల గంటల సవ్వళ్ళు, పాలేళ్ళ అదలింపుల సందళ్ళు.... ఇప్పుడేవి?.... ఏవి?

దుఃఖభారంతో కళ్ళు మూసుకున్నాడు. కన్నీరు జాలువారింది.

కన్నకొడుకులు ముగ్గురూ పిల్లల చదువులకోసమని వూరొదిలి పట్నం చేరారు. "ఒరేయ్! పిల్లల చదువులకని మీ రెందుకు వూరొదిలిపోతారు! బంగారం పండే భూమి వుంది. మీ రెళితే వ్యవసాయం కుంటుపడుతుంది. నాకా ఎల్లకాలం చేసే శక్తీ వుండదు. పిల్లల్నే పట్నంలో వుంచి చదివించండి." అంటూ ఎన్నో విధాలుగా తనూ, యశోదా చెప్పి చూశారు.

ఎవరూ విన్లేదు. పంతం విడువలేదు. "నాన్నా! రేయింబవళ్ళూ బురద పిసికితే చేతికొచ్చేది గుప్పెడు ధాన్యపు గింజలేగా! ఏదో వ్యాపారం చేసుకుందాం. పిల్లలు చదువుల్లో పైకొస్తే మట్టి పులుముకునే అవసరమూ వుండదు." అంటూ ఒకేలా వాదించారు.

సలహా చెప్పేవరకే తన పెద్దరికం. చెవులు మెలేసి శాసించటానికి వాళ్ళేం చిన్నపిల్లలు కాదుగా! పొలిమేర దాటారు.

చివరకు జరిగిందేవిటి? తెలిసీ తెలియని వ్యాపారాలు అచ్చిరాలేదు. పట్నపు ఆకర్షణలు మనవళ్ళకు అంతగా చదువులు అబ్బకుండా చేశాయి. వేలు సంపాదించాలని వెళ్తే అప్పులు పెరిగాయి. బరువులు మిగిలాయి.

పిల్లల పెళ్ళిళ్ళనీ, అప్పులనీ, అవనీ ఇవనీ అస్తులు పంచమన్నారు. మార్గాంత రంలేక అంగీకరించాడు. తమ కోసమని మూడెకరాలు అట్టే పెట్టారు. మిగతా ముప్ఫయి ఎకరాల మాగాణి ముక్కలైంది. తరతరాల తమ వంశీకులు నాగళ్ళు మోపి దున్నిన భూమి, చెమటతో తడిపి సేద్యంచేసిన భూమి చేతులు మారింది.

"నాయనా! భూమిని నమ్ముకుని బ్రతకమని పెద్దలు అప్పగించారు. అమ్ముకు బ్రతకాల్సిన దుస్థితికొచ్చారు. అంతా చేజారిపోయింది." విలపించాడు తను.

కాలం గడిచిపోతుంది. భార్యా, బిడ్డలూ ఒక్కొక్కరుగా కాలగర్భంలో కలసిపోయారు. మనవళ్ళంతా ఇంటివాళ్ళై, పిల్లల్ని కని, చాలీచాలని జీతాలతో యాతనలుపడుతూ తలో దిక్కున దుర్భరంగా బ్రతుకుతున్నారు. తన కొడుకు లాశించినట్లు మనవళ్ళు చదువులతో అందలాలెక్క లేదు.

మనవళ్ళు కొన్నాళ్ళు తన చుట్టూ పోటీలుపడి తిరిగారు. తమతో వచ్చెయ్యమని, ఏ లోటూ రాకుండా చూసుకుంటామని కాళ్ళావేళ్ళా పడ్డారు. వాళ్ళ అభ్యర్థన వెనుక, తనపై మమకారం కన్నా, తనపేరవున్న ఆస్థిని స్వంతం చేసుకోవాలన్న స్వార్థమే ఎక్కువ కనిపించింది.

"బాబూ! ఇక్కడి చెట్లూ, పుట్టలతో నాకున్న బాంధవ్యం మీ కర్థంకాదు. నా దనుకున్న ఈ మట్టిలోనే నేనూ కలిసిపోవాలి. నా చావుకబురు చెవినబడ్డప్పుడు మీరొచ్చి ఆ ఒక్క కోరిక మాత్రం తీర్చండి చాలు." సాగనంపాడు.

తనమీద కోపంతో, అయిదారేళ్ళుగా ఒక్కరూ ముఖంకూడా చూపించటం లేదు. బహుశ తన చావుకబురు తప్ప, తన గూర్చిన మరే సంగతి వాళ్ళను సంతోషపెట్టలేదు.

అవును! తను మాత్రం ఇంతకాలం బ్రతికి ఏం సాధించగలిగాడు. విషాదాన్ని తలపోసుకుని కుమిలిపోతూ నరకంలో బ్రతకటం మినహా తనేం సుఖపడ్డాడు? ఇన్నేళ్ళ బ్రతుకులో తను సంతోషపడిం దెంతకాలం?

తన ఆవేదన నర్థంచేసుకోవటానికి, ఓదార్చటానికి మనిషంటూ ఎవరు మిగిలారు? గత కాలపు ఔన్నత్యాన్ని, విలువల్ని జ్ఞప్తిచేస్తూ ఓదార్పు కలిగించేది ఒక్కటే!

తన ఆకుల గలగలలతో మధుర స్మృతుల్ని ధ్వనింపజేసే, తరతరాల ఆ మర్రిచెట్టు. దాని భాష నర్థంచేసుకోలేని ఈ తరపు కర్కశత్వం ఆ చెట్టును మట్టుబెట్టబోతుంది.

ఆ ఆలోచన శివయ్య మనసును రంపాలతో కోస్తున్నట్లనిపించింది. రేపటినుండి అదిలేని వూరిని వూహించు

కోవటానికే భయం వేసింది. రాత్రిళ్ళు నిద్రపట్టక, ఒంటరితనంతో కుమిలి పోతున్న శివయ్య మనసును ఆ చెట్టు గలగల సంగీతం మధురంగా స్పృశి స్తుంటే జోలపాడుతున్నట్లే నిద్రపో గలిగేవాడు.

అలాంటిది, ఈరోజు ఏ మాత్రం శబ్దం అటునుండి వినరావటం లేదని గమనించి ఆందోళనపడ్డాడు. ప్రకృతే స్థంభించినట్లుగా వుంది.

లేచి వసారా బయటకు వచ్చాడు. ఉత్తరపు దిక్కుగా కళ్ళు చిట్లించి చూశాడు. నిశ్చలమైన నల్లని కొండలా నిశబ్దంగా వుంది మర్రిచెట్టు.

"ఏవిటీ విషాదం? ఎందుకీ నిశబ్దం?" గొణుక్కున్నాడు. భారమైన మనసుతో బయటకు నడిచాడు.

ఊరంతా నిశబ్దంగా వుంది. అక్కడక్కడ ఏ కుక్క అరుపో మినహా మరే సందడీలేదు. అంతా విషాదం అలుముకున్నట్లే వుంది.

కొద్దిసేపటికి మర్రిచెట్టు క్రిందకు చేరుకున్నాడు. చీకటి ముసుగులో చెట్లు బితుకుబితుకు మంటూ దాగున్నట్లుంది. శివయ్య చెట్టుక్రింద అంతా కలయ దిరిగాడు. భూమిలోకి నాటుకుపోయిన దృఢమైన వూడల్ని వణికే చేతుల్తో స్పృశిస్తూ మూగవేదన అనుభవించాడు.


మర్రిచెట్టు స్థబ్దత ఆయన హృద యాన్ని కదలించి వేస్తుంది. కీచురాళ్ళ ధ్వనులు మాత్రం భీకరంగా వినిపిస్తు న్నాయి. వెర్రివాడిలా మర్రివూడల్ని బలంగా కుదిపాడు. ఆ మాత్రానికే చెట్టులో ఏ కదలికా రాదని ఆలోచించ లేకపోయాడు.

ఆయాసంతో రొప్పుతూ, చెట్టు మొదలుచుట్టూ వున్న రచ్చబండమీద వాలిపోయాడు. ముసిరిన జ్ఞాపకాన్ని ఒక్కసారిగా ఇముడ్చుకోలేక వుక్కిరి బిక్కిరయ్యాడు.

పెచ్చులూడి, పగుళ్ళుబారి, రాళ్ళురాలి శిథిలమైపోతుంది రచ్చబండ. ఆనాటి ఆత్మీయతల్ని పంచే కూడలిగా, న్యాయ స్థానంలా విలసిల్లిన రచ్చబండ నేడు కుర్రకారు పేకాటలకు నిలయమైంది.

చిన్నతనంలో స్నేహితులంతా, చల్లని నీడలో కాలం ఎరుగక ఆట పాటల్లో మునిగితేలింది ఈ రచ్చబండ మీదే— సాయంత్రం కాగానే వూరి పెద్దలంతా ఒక కుటుంబంలా చేరి కష్ట సుఖాలు చెప్పుకున్నది ఈ రచ్చబండ మీదే— సమస్యలేవైనా వస్తే కొట్లాడు కోకుండా స్నేహపూర్వకంగా పరిష్క రించుకున్నది ఈ రచ్చబండమీదే— తమ తరానికి మార్గదర్శకంగా, ముందు తరపు అడుగుజాడల్లో నడిపించింది ఈ రచ్చ బండే!

ఏ అరమరికలు లేకుండా, తన నీడనే కలసిమెలసి మసలుతున్న కష్టజీవులను



చల్లనిగాలితో సేదతీరుస్తూ, మురిసిపోయిందీ ఈ మర్రిచెట్టే.

కొడుకులు ముగ్గురూ ఊరొదిలి వెళ్తుంటే బసు ఎక్కించి, కళ్ళముందు లేకుండా పోయారన్న దిగులును దిగమ్రింగింది, గుండె రాయిచేసుకొందీ ఈ నీడనే. వాళ్ళు భూమినమ్ముకొని ఊరితో పూర్తి సంబంధాలను త్రెంచుకుని లక్ష్మి మూటగట్టుకుని పొలిమేర దాటితే, ఇంటికెళ్ళేందుకు మనస్కరించక కుమిలిపోతూ ఊరటచెందినదీ ఈ నీడనే-

తన తరంవాళ్ళంతా ఒక్కొక్కరే కాలగర్భంలో కలసిపోతుంటే, అందరికీ అంతిమ వీడ్కోలిచ్చి, తల్లడిల్లిపోతుంటే, తనతో విషాదాన్ని పంచుకోగలిగింది ఈ చెట్టుగాక వేరెవరు?

కడసారిగా యశోదకూ వీడ్కోలిచ్చి, "యశోదా! నాకు మిగిలిన ఒక్కతోడూ దూరమైంది. నువ్వూ లేకుండా పోయావు. ఇంకెవరు మిగిలారు?" దూరంగా స్మశానంలో కనిపిస్తున్న మంటలు చూస్తూ విలపిస్తుంటే, జ్ఞాపకాల్ని నాపై వర్షిస్తూ

నే నున్నానంటూ ధైర్యం చెప్పిందీ ఈ చల్లనితల్లే!

ఈ తల్లే– చివరకు తనను దురదృష్టవంతుడ్ని చేయబోతుంది. ఒంటరి వాడ్ని చేస్తుంది. తన వాళ్ళందరిలా వీడ్కోలందుకోలేదు. తనే విషాదంగా వీడ్కోలివ్వాలి. భవిష్యత్తరాలకు గత వైభవాలను చాటి చెప్పేందుకు మిగిలున్న ఒకే ఒక్క తీపిగుర్తు చెరిగిపోబోతుంది.

రేపటినుండి తను సేదదీరేందుకు ఈ చల్లని నీడా దొరకదు. ఓదార్పు పొందేందుకు ఈ తల్లి ఒడీ దక్కదు. మధురసంగీతం ఇకపై తన చెవుల్ని సోకదు. ఏ తీపి జ్ఞాపకాలూ గుర్తొచ్చి తన మనసును ఆనంద పెట్టవు– పగలూ నిశబ్దం! రేయీ నిశబ్దం!

రోజంతా నిశబ్దం! భయంకర నిశబ్దం!

ఒక్కసారైనా ఆ చల్లనిగాలి వీచదేం? ఆకుల తంత్రులను మీటి సంగీతం వినిపించదే! శ్రావ్యనాదాలతో ప్రకృతిని పులకరింపజేయదేం! పరవశింపజేయదేం!

ఒక్కసారి! ఒక్కసారి!....

శివయ్య దృష్టి గాడాంధకారంలోకి చొచ్చుకెళ్తూ వెలుగుకోసం వెతుకులాడుతుంది. కన్నీరు జాలువారి రచ్చబండను తడిచేస్తుంది. ఉద్వేగంతో శరీరం కంపిస్తుంది.

ఎంతోసేపటినుండి మేఘాల్ని పేర్చుకొంటున్న ఆకాశంలో కదలిక వచ్చింది. అంతే!.... ఒక్కసారిగా గాలి విరుచుకుపడింది. ఆ విసురుకు చెట్టు గలగలలాడింది. ఇంకా.... ఇంకా గాలి పెరిగిపోతోంది, ప్రకృతే గజగజలాడేంతగా! ఆకులు కుప్పలుగా రాలి చెల్లాచెదరుగా ఎగురుతున్నాయి. సంగీతంలో అపస్వరాలు వినవస్తున్నాయి. కొమ్మలు విరిగిపడ్తున్నాయి. పక్షులు దీనంగా అరుస్తూ దిక్కుతోచక భయంతో కకావికలైపోతున్నాయి.

మెరుపుకొరడా దెబ్బలకు ఆకాశం భయానకంగా గర్జిస్తోంది. చీకటి వణికిపోతోంది. శివయ్య దృష్టి చెదరడంలేదు. మనసు బెదరటంలేదు. ఏ భయం లేకుండా నిశ్చలంగా అలానే పడున్నాడు. వర్షం జోరున మొదలైంది.

* * *

తెల్లవారింది. ఊరి జనానికి, విరిగిన కొమ్మలతో చిందవందరైన మర్రి చెట్టూ, గుట్టలుపడ్డ ఆకులు, వాటి అడుగున కప్పడిపోయిన శివయ్య మృత దేహం కనిపించాయి. కూలీలకు ఆ చెట్టును నరకటం సులువైందన్న సంతోషం మిగిలింది.